ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కందగట్ల స్వామి

హిమాయత్ నగర్ , మార్చి 19: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విశేషంగా కృషి చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య కొండాల క్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, ప్రత్యేక రాష్ట్రం వచ్చే వరకు ఎలాంటి పదవులు తీసుకోనని ఉన్న పదవులను వదులు కున్న గొప్ప నాయకుడు బాపూజీ అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో బాపూజీ తనవంతు పాత్ర పోషించారని ఆయన సేవలను గుర్తించి తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, కోశాధికారి కొక్కుల దేవేందర్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

హైదర్ షాకోట్ జిల్లా పరిషత్ పాఠశాలలో శానిటేషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్ చంద్ర

బండ్లగూడ, మార్చి 19: ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు నేపథ్యంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పరీక్షా కేంద్రాలను బుధవారం కమిషనర్ శరత్‌చంద్ర పరిశీలించారు. పరీక్షల కోసం వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ పాఠశాల ఉపాధ్యాయులకు ఆయన సూచించారు.

వస్తున్నారు..వెళ్తున్నారు..!

- బండ్లగూడలో 100 ఫీట్ల రోడ్ల నిర్మాణం జరిగేనా..!
- ఇరుకు రోడ్లతో స్థానికుల ఇబ్బందులు
- ఏడాదికాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులు
- బీఆర్ఎస్ హయాంలో కోటిపైగా రూపాయలు కేటాయించినా.. మంజూరు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం

బండ్లగూడ నుంచి కిస్మత్పూర్ వరకు రహదారికి పక్కన ఉన్న గోడలకు మార్కింగ్ చేసిన దృశ్యం

బండ్లగూడ, మార్చి 19 : అదిగో పులి అంటే.. ఇదిగో తోక అన్న చందంగా ఉంది హెచ్ఆర్‌డీసీఎల్ సంస్థ పనులు. రోడ్ల విస్తరణ పేరుతో అధికారులు కాలయాపన చేస్తూ ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గత ఏడాది బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 100 ఫీట్ల రోడ్డు విస్తరణకు ఏడాది క్రితం అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. అందుకు సంబంధించి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోటి లక్ష రూపాయల నిధులు కూడా కేటాయించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పనులు ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలు గడుస్తున్నా..ఆ నిధులను మంజూరు చేయలేదు. దీంతో ఆ రోడ్డు పనులు నేటికీ ప్రారంభం కాలేదు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ నుంచి బండ్లగూడ, దర్గా ఖలీజ్‌ఖాన్ నుంచి కిస్మత్పూర్ , కిస్మత్పూర్ నుంచి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరకు నిత్యం అనేక వాహనదారులు, ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రోడ్ల విస్తరణ చేపట్టేందుకు అనేక చర్యలను చేపట్టింది. అందులో భాగంగానే బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బండ్లగూడ చౌరస్తా నుంచి కిస్మత్పూర్ వరకు, కిస్మత్పూర్ నుంచి దర్గా ఖలీస్ ఖాన్, ఎక్సైజ్ అకాడమీ నుంచి కిస్మత్పూర్ వరకు మూడు రోడ్లను 100 ఫీట్ల రోడ్డు వేసేందుకు ఏడాది క్రితమే అధికారులు ప్రణాళికలు రూపొందించడంతోపాటు టెండర్లను సైతం పూర్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే రోడ్డు కిరువైపులా మార్కు వేశారు. నాటి నుంచి నేటి వరకు అధికారులు వస్తున్నారు.. రోడ్లను పరిశీలించి వెళ్తున్నారు తప్ప రోడ్డు పనులను ప్రారంభించడం లేదు. ఇటీవల హెచ్ఆర్‌డీసీఎల్ అధికారులు వచ్చి రోడ్లను పరిశీలించి వెళ్తున్నారు తప్ప పనుల్లో పురోగతి కనిపించడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి అయిన టెండర్లు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం కోసం అధికారులు ఇటీవల వచ్చి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర ఇతర అధికారులతో కలిసి మరల పరిశీలించి వెళ్లారు. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయని నమస్తే తెలంగాణ ప్రతినిధి డిప్యూటీ ఇంజినీర్ కిశోర్‌ను వివరణ కోరగా టెండర్ పనులు పూర్తయినట్లు అగ్రిమెంట్ కావడమే తరువాత రోడ్డు పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ రోడ్డు విస్తరణ పనుల కోసం ఒక కోటి లక్ష రూపాయలను నిధులు మంజూరైనట్లు తెలిపారు.

హెచ్ఆర్‌డీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిశోర్

రోడ్ల విస్తరణ కోసం హెచ్ఆర్‌డీసీఎల్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర (ఫైల్)

ఆస్తిపన్నులు చెల్లించకుంటే..ఆస్తులు జప్తు

రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్

ఎంఎం పహాడీలో ఆస్తిపన్ను చెల్లించని వారి ఆస్తిని సీజ్ చేస్తున్న రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ అధికారులు

బండ్లగూడ, మార్చి 19: ఆస్తి పన్ను చెల్లించని వారి ఆస్తులను జప్తు చేస్తామని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఎంఎం పహాడీలో ఓ వ్యక్తి ఆస్తిపన్ను రూ. 12 లక్షలు చెల్లించవలసి ఉండగా అందులో నుంచి రూ. 3 లక్షలు వడ్డీ పోగా మిగితా రూ. 9 లక్షలు చెల్లించవలసి ఉందని డీసీ రవికుమార్ తెలిపారు. తన ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో రెవెన్యూ అధికారులు తమ సిబ్బందితో కలిసి బుధవారం అతడి ఆస్తిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీసీ రవికుమార్ మాట్లాడుతూ.. 2024 – 2025 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ ఆస్తి పనులను చెల్లించి అభివృద్ధికి పాటుపడాలన్నారు.

'రాష్ట్ర బడ్జెట్‌లో యువకులకు అన్యాయం'

హిమాయత్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువజన రంగానికి అన్యాయం చేసిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లాఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. యువజన కమిషన్ ఏర్పాటు హామీని ప్రకటించకపోవడం దౌర్భాగ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారాలకు ఇస్తున్న ప్రాధాన్యత ఉద్యోగాల భర్తీ కి ఇవ్వడం లేదని విమర్శించారు. ఉపాధి రంగానికి రూ.900 కోట్ల నిధులు కేటాయించడం సరికాదన్నారు. యువజన రంగానికి బడ్జెట్ మరిన్ని నిధులు కేటాయించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పార్కులను అధునాతన పద్ధతిలో అభివృద్ధి చేయాలి

హార్టికల్చర్ అర్బన్ బయోడైవర్సిటీ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 19: పార్కులను అధునాతన పద్ధతిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం కాటేదాన్‌లోని ఆయన కార్యాలయంలో అర్బన్ బయోడైవర్సిటీ హార్టికల్చర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం పార్కు, సారధి యూత్ క్లబ్ జీహెచ్ఎంసీ పార్కు, హనుమాన్ దేవాలయం కళ్యాణ మండపం పార్కు అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించాలన్నారు. ఎండాకాలం దృష్టి లో ఉంచుకొని తగిన నీరు సౌకర్యం కల్పించాలన్నారు. అదేవిధంగా పార్కు సుందరీకరణ పనులపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అర్బన్ బయోడైవర్సిటీ రాజేంద్రనగర్ సర్కిల్ మేనేజర్ అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్ పాల్గొన్నారు.

ప్రకృతితోనే మానవ మనుగడ సాధ్యం

నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న కిష్టారెడ్డి

హిమాయత్ నగర్ , మార్చి 19: ప్రకృతితోనే మానవ మనుగడ సాధ్యమని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి, రాష్ట్ర కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయి ంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీఎస్ఆర్ రాజేంద్ర సింగ్ అన్నారు. బుధవా రం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభు త్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో గ్రీన్ ట్రెం డ్స్ –మార్గదర్శక పర్యావరణ స్థిరత్వం అనే అంశం పై అంతర్జాతీయ సదస్సు జరిగింది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు వారు హాజరై మాట్లాడుతూ కొన్ని దేశాల్లో జరిగే పర్యావరణ విధ్వం సం వల్ల అన్ని దేశాలు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్ప డిందన్నా రు. ఈ సమావేశంలో ప్రతినిధులు ప్రొఫెసర్ కె.శైలజ, డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి, డాక్టర్ రామలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ గడ్డం ఆదాము, డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ రాజశేఖర్, రాజేశ్వర్, డాక్టర్ భిక్షపతి, గోవింద్, రవికుమార్, శ్రీనివాస్, సీవీఎల్ నారాయణ, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

పరీక్షలు సరిగా రాయలేదని.. ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

బంజారాహిల్స్, మార్చి 19: ఇంటర్ పరీక్షలు సరిగా రాయలేదని మనస్థాపానికి గురైన ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్–10 హైలం కాలనీలో నివాసం ఉంటున్న ఎర్ర స్వామి కుమార్తె సుమ(17) కర్నూల్ లోని బీసీ హాస్టల్లో ఉంటూ ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నది. ఇటీవల పరీక్షలు పూర్తవ్వడంతో ఆమె హైలం కాలనీలోని తల్లిదండ్రుల ఇంటికొచ్చింది. వచ్చిన పుటి నుంచి బాధ గా ఉంటున్న సుమ పరీక్షలు సరిగా రాయలేదంటూ బాధపడుతున్నది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో సుమ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్వామి చెల్లెలు కుమార్తె లేఖ వారి ఇంటికి రాగా.. సుమ గది వద్దకు వెళ్లి తలుపు తట్టగా తీయలేదు. దీంతో స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా సుమ ఉరేసుకొని కనిపించింది. ఆమెను కిందికి దింపి స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతురాలి తండ్రి స్వామి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిమ్స్‌కు సోలార్ ప్యానెల్ అందజేత

సోలార్ ప్యానెల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, మార్చి 19 : నిమ్స్ దవాఖానకు నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.20 లక్షలు విలువ చేసే సోలార్ ప్యానెల్స్‌ను బహూకరించారు. నిమ్స్‌లోని డయాలసిస్ కేంద్రానికి ఉపయోగపడే విధంగా ప్రాజెక్ట్ గ్రీన్ డయాలసిస్ ఇన్సియేటీవ్ పేరుతో సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్యానెల్స్‌ను డైరెక్టర్ డాక్టర్ బీరప్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెఫ్రాలజీ ప్రొఫెసర్లు డాక్టర్ భూషణ్ రాజు, డాక్టర్ గంగాధర్, డాక్టర్ స్వర్ణలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చర ణ్, డాక్టర్ రాకేశ్, ఆర్ఎంవో హేమంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కండ్ల అద్దాలు అందజేత

విద్యార్థుల చదువులకు కంటి చూపు చాలా అవసరమని.. కంటి చూపు కాపాడుకునేందుకు ముందు చూపు ముఖ్యమని గోల్కొండ ఎస్ పీ హెచ్ఓ డాక్టర్ మురళీధర్ అన్నారు. బుధవారం షేక్‌పేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. – జూబ్లీహిల్స్, మార్చి 19:

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు అని కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి. రవి శేఖర్ రెడ్డి అన్నారు.రహమత్ నగర్ డివిజన్ కార్మిక నగర్ లో సలీం పాషా ఇఫ్తార్ విందుకు హాజరై ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. – వెంగళరావునగర్, మార్చి 19:

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి

హిమాయత్ నగర్, మార్చి19: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21 నుంచి జరిగే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలను సాధించాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో ఏ విధంగా పరీక్షలు రాస్తారో అదే విధంగా పదవ తరగతి పరీక్ష సెంటర్‌లో కూడా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు చదువుతున్నప్పుడు మధ్యలో అర గంట విశ్రాంతి తీసుకుని పుస్తకాలను తిరిగేయాలని సూచించారు.పౌష్టికాహారాన్ని లేటుగా తీసుకోకుండా సరైన సమయంలో తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే సూచనలు తప్పకుండా గమనించాలన్నారు.

అగ్నిమాపక వాహనం ఢీకొని మహిళ మృతి

బండ్లగూడ, మార్చి 19: అగ్నిమాపక వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సబ్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖయ్యూం నగర్ ఎం ఎం పహాడీకి చెందిన సోహన్ ఫాతిమా అనూజ్(27), కేర్ ఆస్పత్రిలో డాక్టర్ ప్రాక్టీస్ చేస్తున్నారు. కాగా బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఆమె విధి నిర్వహణ కోసం ఆసుపత్రికి వెళుతుండగా అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 157 వద్ద అగ్నిమాపక వాహనం ఆమె ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె కిందపడి తలకు తీవ్ర గాయమై రక్తసంబంధం జరిగింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలి

అడ్డగుట్ట, మార్చి 19: ఆశ వర్కర్ల కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మారేడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సంవత్సరాలుగా ఆశ వర్కర్ల వేతనం అంతంత మాత్రంగానే ఉంటున్నాయని, తద్వారా వారికి పనిభారం పెరిగి ఆర్థిక ప్రయోజనం తక్కువగా కలుగుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఆశ వర్కర్ల వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని వారు కోరారు.

సమస్యల వలయంలో 'సాయిచంద్ర కాలనీ'

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి
ప్రజాభిప్రాయ సేకరణలో బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

సాయి చంద్ర కాలనీలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

మణికొండ, మార్చి 19 : మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రతిరోజూ స్థానిక కాలనీలు, బస్తీలను సందర్శిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భాగంగా బుధవారం పుప్పాలగూడ పరిధిలోని బీఆర్సీ ప్రాంతంలో ఉన్న సాయి చంద్ర కాలనీలో స్థానికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు పర్యటించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాయి చంద్ర కాలనీ వాసులు అనేక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చి తక్షణమే పరిష్కరించేలా చొరవ చూపాలని కోరారు. సంబంధిత అధికారులపై సమస్యలపై దృష్టి కేంద్రీకరించి వెంటనే చర్యలు తీసుకోవాలని మణికొండ బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందని పార్టీ అధ్యక్షుడు సీతారాం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, గోరుకాంటి విఠల్, సంఘం శ్రీకాంత్, దిలీప్, యాలాల కిరణ్, భానుచందర్, సుమనళిని, రమణ మూర్తి, తిరుపతి పాల్గొన్నారు.

భార్యతో సన్నిహితంగా ఉన్నావని కత్తితో దాడి: వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, మార్చి 19: తన భార్యతో సన్నిహితంగా ఉంటున్నావ్ అంటూ అనుమానంతో యువకుడిపై దాడి చేయడంతో పాటు కత్తితో వెంటపడి హత్య చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే ఫిలింనగర్ బసవతారకం నగర్ లో నివాసం ఉంటున్న షేక్ అబ్దుల్ రెహమాన్ (25) కార్ డ్రైవర్ గా పని చేస్తుంటాడు. ఇంటి పక్కన ఉండే రాజమణి అలియాస్ నజియా బేగం, ఆమె కొడుకు షేక్ అర్బాజ్ తో రెహమాన్ కు స్నేహం ఉంది. కాగా గత కొంతకాలంగా నాజియా బేగం కుమార్తె తన తల్లి ఇంటికి వచ్చి ఇక్కడే ఉంటోంది. ఆమె భర్త మహ్మద్ అమీర్ దోపిడీ కేసులో అరెస్టు అయి జైలుకి వెళ్ళాడు .కాగా జైలులో ఆన్న అమీర్ కు తన భార్యకి, ఇంటి పక్కన ఉండే మహ్మద్ షోయబ్ కు మధ్యన స్నేహం ఉందంటూ అనుమానం ఉంది. ఇదే విషయాన్ని గురించి జైల్లో ములాఖాత్ కోసం వెళ్లిన భార్య ను నిలదీయడంతో పాటు బయటకు వచ్చిన తర్వాత షోయబ్ అంతు చూస్తా అంటూ బెదిరించాడు. ఈ క్రమంలో ఈనెల 17న జైలు నుంచి బయటకు వచ్చిన మహ్మద్ అమీర్ నేరుగా షోయబ్ ఇంటికి వచ్చి బయట కాపు కాశాడు. తలుపు సందులోంచి బయటకు చూడగా పెద్ద తల్వార్ చేతిలో పట్టుకుని ఇంటి బయట కనిపించాడు. దీంతో ఆందోళనకు గురైన షోయబ్ తన బంధువులకు చెప్పగా వారు వచ్చి అమీర్ ను పంపించి వేశారు.

కొంత సేపటికి అక్కడి నుంచి బయటకు వెళ్ళగా మహాత్మా గాంధీనగర్ వద్ద కత్తితో న్యూసెన్స్ చేయడంతో పాటు షోయబ్ మీద కత్తితో దాడి కోసం యత్నించాడు. ఈ మేరకు బాధితుడు షోయబ్ మంగళ వారం రాత్రి ఫిలిం నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విశ్వక్ సేన్ ఇంట్లో చోరీ..

ముగ్గురు యువకుల అరెస్టు

బంజారాహిల్స్, మార్చి 19: సినీ నటుడు విశ్వక్సేన్ నివాసంలో చోరీ కేసులో ముగ్గురు నిందితులను ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. వివరాల్లోకి వెళ్తే. ఫిలింనగర్ రోడ్ నెంబర్ 8 లో నివాసం ఉంటున్న సినీ నటుడు విశ్వక్ సేన్ ఇంట్లో ఈనెల 14 న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి రెండు వజ్రపు ఉంగరాలు. హెడ్ ఫోన్ సెట్ చోరీ చేశారు. ఈ ఘటనపై విశ్వక్సేన్ తండ్రి సీ.రాజు ఇచ్చి న ఫిర్యాదుతో రంగంలోకి దిగిన క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనా స్థలంలో సీసీ కెమెరాలు.. స్థానికంగా సీసీ కెమెరాల ఆధారంగా చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించారు. చోరీకి పాల్పడింది బేగంపేట్ లో ఒకే గదిలో నివాసం ఉంటూ ఫుడ్ డెలివరీ బాయ్స్ ఉద్యోగం చేస్తున్న భీమవరపు స్వరాజ్ (21), బొల్లి కార్తీక్ (22) నేరేడుమిల్లి సందీప్(21) అని తేలింది.వారిని బుధవారం అరెస్ట్ చేసిన పోలీసులు వారి వద్ద నుంచి చోరీ సొత్తు స్వాదీనం చేసుకున్నారు.

విశ్వక్సేన్ నివాసం తో పాటు సమీప ప్రాంతా ల్లో పలుమార్లు ఫుడ్ డెలివరీ కోసం వచ్చిన నిందితులు రెక్కీ నిర్వహించి ఈజీ మనీ కోసం చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. చోరీ సొత్తు ను విక్రయించే క్రమంలో నిందితులపై పోలీసులు నిఘా పెట్టి వారిని అరెస్ట్ చేశారు.

ఎమ్మెల్యే ఫేక్ స్టిక్కర్‌తో సంచారం
పోలీసులకు ఫిర్యాదు
నిందితుడి గుర్తింపు

ఖైరతాబాద్, మార్చి 19 : ఎమ్మెల్యే స్టిక్కర్‌తో గుర్తుతెలియని వాహనం రోడ్లపై సంచరించడం కలకలం రేపింది. సదరు ఎమ్మెల్యే పీఆర్వో గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...రాష్ట్ర మంత్రి దన్నసరి అనసూయ (సీతక్క) కారుకు ఉండే ఎమ్మెల్యే స్టిక్కర్‌ను పోలిన మరో ఫేక్ స్టిక్కర్‌ను ఓ వ్యక్తి తన థార్ కారుపై వేసుకొని నగరంలో సంచరిస్తున్నాడు. ఎమ్మెల్యే అభిమానులు, కార్యకర్తల ద్వారా ఆ విషయం మంత్రి పీఆర్వో పాండునాయక్ దృష్టికి రాగా, పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీఆర్ నంబరుతో ఉన్న యజమానిని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. నిందితుడు మహబూబ్ నగర్‌కు చెందిన భాను ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు..

ఖైరతాబాద్, మార్చి 19 : ప్రిజన్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న జూబ్లీహిల్స్ డాక్టర్ ఎంసీహెచ్ఆర్‌డీ కాన్ఫరెన్స్ హాల్‌లో మొదటి జాతీయ ప్రిజన్ కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షులు నరసింహ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కారాగారాలను కర్మాగారాలుగా, విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సంకల్పించిన మాజీ డీజీపీ వీకేసింగ్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభిస్తారన్నారు. అనంతరం సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను ఆర్గనైజేషన్ ప్రతినిధులు లక్ష్మీ చౌదరి, అశోక్ కుమార్, వినీత్ సింగ్‌లతో కలిసి ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

మణికొండ, మార్చి 19: నార్సింగి ఔటర్ సర్వీస్ రోడ్డులో అతివేగంగా వెళ్తున్న ఆటో డ్రైవర్ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఢీకొట్టి పరారైన ఘటన నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నార్సింగ్ నుంచి గచ్చిబౌలి వైపు ట్రాఫిక్ కానిస్టేబుల్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. వెనుకాల నుంచి వస్తున్న మరో ఆటో డ్రైవర్ అదే స్పీడ్‌లో వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్‌కు ఎడమ కాలు విరిగింది. గమనించిన ఆటో డ్రైవర్ రోడ్డుపై ఆటో వదిలేసి పరుగులు తీస్తుండగా.. స్థానికులు పట్టుకొని నార్సింగ్ పోలీసులకు అప్పగించారు. కానిస్టేబుల్ తన ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళుతున్న విషయాన్ని గమనించక ఆటోడ్రైవర్ అజాగ్రత్తతో ఢీకొట్టాడని స్థానికులు తెలిపారు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసం.. నిందితుల అరెస్టు

బంజారాహిల్స్, మార్చి 19:ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఓ కన్సల్టెన్సీ సంస్థ నిర్వాహకులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. బంజారా హిల్స్ రోడ్ నంబర్–1లోని సూఫీ చాంబర్స్ 4వ అంతస్తులో ఫ్యూజన్ ఫ్యూచర్ హబ్ పేరుతో ఓ కన్సల్టెన్సీ సంస్థ ద్వారా నిరుద్యోగులకు వల వేస్తున్నారని నాగారం ప్రాంతానికి చెందిన జి. దివ్య, మనోజ్ఞ తదితరులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోజుకు సుమారు 20 నుంచి 30 మందిని పిలిపించి ఇంటర్వ్యూ పేరుతో రూ.3వేల నుంచి రూ.5వేల వసూలు చేశారని, వందలాది బాధితులు ఉన్నారని విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. దీంతో సంస్థ డైరెక్టర్ ఆర్యూ, వైభవ్, డేవిడ్, హరీశ్‌లను బుధవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలి

సికింద్రాబాద్, మార్చి 19: ఇందిరానగర్ కాలనీలో స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్ నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు. ఇందిరానగర్ రోడ్ నం.3లో జరుగుతున్న స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. దాదాపు రూ.70 లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వ రగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.